శ్మశానవాటికలకు కొత్తరూపు

- రూ.లక్షల వ్యయంతో అభివృద్ధి
- చకచకా పనులు



గుడివాడ అప్పన్న కాలనీ శ్మశానవాటిక


శ్మశానవాటిక లోపలి భాగం

గాజువాక : గాజువాకలోని వివిధ వార్డుల్లో శ్మశానవాటికలు కొత్తరూపు సంతరించుకొంటున్నాయి. లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. కొన్నిచోట్ల ఇప్పటికే పనులు పూర్తి కాగా, మరికొన్ని వాటికి పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలో ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని శ్మశానాలను ప్రస్తుత పాలకవర్గం అభివృద్ధి చేస్తోంది. దీంతో అవి ఆహ్లాదకరంగా కనిపిస్తున్నాయి. అందమైన ప్లాట్‌ఫారాలు, ప్రహరీలతో పాటు శ్మశానవాటికలో అవసరమైన సౌకర్యాలను అందుబాటులోకి తెస్తున్నారు.

- 68వ వార్డు గుడివాడ అప్పన్న కాలనీ శ్మశానవాటికను ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేశారు. రూ. 30 లక్షలతో ప్లాట్‌ఫారాలు, వెయిటింగ్ హాల్‌తో పాటు పచ్చదనం పెంపొందించేందుకు అనువుగా ఏర్పాట్లు చేశారు.
- ఇదే వార్డులో మింది శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణం రూ.45 లక్షలతో సాగుతోంది. అనంతరం శ్మశానాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించనున్నట్టు జీవీఎంసీ అధికారులు తెలిపారు.
- అక్కిరెడ్డిపాలెం శ్మశానవాటికను రూ.45 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. దీనికి సంబంధించిన పనులు చకచకా సాగుతున్నాయి.
- 71వ వార్డు విశ్వేశ్వరయ్య నగర్ శ్మశాన వాటికను రూ.45 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. ఈ శ్మశానవాటిక ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైంది. స్థానికుల వినతి మేరకు ఎమ్మెల్యే నాగిరెడ్డి అధికారులను ఆదేశించడంతో, ప్రత్యేక నిధులను కేటాయించి అభివృద్ధి పనులను ప్రారంభించారు.
- 79వ వార్డు అగనంపూడి శ్మశానవాటిక అభివృద్ధి పనులను రూ.49లక్షల వ్యయంతో ప్రారంభించారు. ఇక్కడ వివిధ సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు కార్యాచరణను రూపొందించారు.
- 85వ వార్డు తలారివానిపాలెం శ్మశానవాటికను రూ.35 లక్షలతో అభివృద్ధి చేస్తున్నారు. ప్లాట్‌ఫాంతో పాటు ఇతర వసతులను ఏర్పాటు చేయనున్నట్టు అధికారులు తెలిపారు.
- పెదగంట్యాడలోని విమల విద్యాలయం వద్ద గల శ్మశానవాటికలో పిచ్చిమొక్కలు, డెబ్రిస్ వంటి వ్యర్థాలను ఇటీవల అధికారులు తొలగించారు. దీని అభివృద్ధికి కూడా చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుకు జగనన్న భరోసా


నియోజకవర్గ స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన శ్రీనాధు వర్షిణికి నగదు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

- ప్రభుత్వ విద్యాలయాలకు మహర్దశ
- ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు
- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్తు అని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన జగనన్న విద్యా కానుక, జగనన్న ఆణిముత్యాల నగదు పురస్కారాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యాకానుక అందజేయడం అభినందనీయమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోను లేనివిధంగా సంక్షేమ పథకాల అమలులో మన రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇంకా మెరుగైన సంక్షేమ పథకాలను జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెడతారన్నారు. అనంతరం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం విజయ ప్రశాంతి, 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆణిముత్యాలకు నగదు పురస్కారాలు

ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహిస్తూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషదాయకమని ఎమ్మెల్యే నాగిరెడ్డి అన్నారు. జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా గాజువాక నియోజకవర్గ స్థాయిలో 2వ స్థానంలో నిలిచిన గాజువాక జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని శ్రీనాధు వర్షిణికి రూ.10 వేలతో పాటు పాఠశాల స్థాయిలో రూ.3 వేల రూపాయల నగదు పురస్కారాలను ఎమ్మెల్యే నాగిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. పాఠశాల స్థాయిలో రెండో స్థానంలో నిలిచిన షఫీనాకు రూ.2 వేలు, మూడో స్థానంలో నిలిచిన నీలిపూడి చంద్రికకు రూ.1,000 నగదు పురస్కారంతో పాటు ప్రభుత్వం నుంచి మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జనార్దనరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సూర్యనారాయణ, కామునాయుడు, పల్లా పెంటారావు, జి.పూర్ణ, ప్రసన్న వెంకటేశ్వరాలయం పాలక మండలి సభ్యులు అచ్చిలి నాయుడు, మిండా లక్ష్మి, ఉపాధ్యాయులు, పీఎంసీ సభ్యులు పాల్గొన్నారు.


గంగవరం హైస్కూల్లో విద్యార్థినిని సత్కరిస్తున్న హెచ్‌ఎం మాలతి

గంగవరం హైస్కూల్లో..

పెదగంట్యాడ: జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను హెచ్‌ఎం మాలతి శుక్రవారం సత్కరించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి వంతున అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గంటిపిల్లి అమ్మోరు, పేర్ల భారతి, కొవిరి కృష్ణ, బోడిపిల్లి దేముడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేత


విద్యార్థులకు కళ్లజోళ్లు అందిస్తున్న హెచ్‌ఎం కాంతం

అక్కిరెడ్డిపాలెం: జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన కంటి పరీక్షల్లో, 37మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించారు. వాటిని సిద్ధం చేసిన అధికారులు అక్కిరెడ్డిపాలెం సచివాలయ ఏఎన్ఎం మహాలక్ష్మి ద్వారా హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతంకు అందించారు. ఆమె వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల పీడీ మహ్మద్ ఇస్మాయిల్, ఆశ వర్కర్ లీల తదితరులు పాల్గొన్నారు.

రామ్ గ్రూప్‌లో ఇంటర్న్‌షిప్‌కు విజ్ఞాన్ విద్యార్థుల ఎంపిక


ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన ఎంబీఏ విద్యార్థులతో అధ్యాపకులు

అగనంపూడి: ప్రసిద్ధ రామ్ గ్రూప్ సంస్థలో ఇంటర్న్‌షిప్ చేసేందుకు దువ్వాడ విజ్ఞాన్ ఎంబీఏ కళాశాలకు చెందిన 25 మంది విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ జె.సుధాకర్ తెలిపారు. సంస్థలో ఇంటర్న్‌షిప్ కోసం పలుదశల్లో ఇంటర్వ్యూలు, పరీక్షల అనంతరం ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న 24 మంది, ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఒక విద్యార్థి ఎంపికైనట్టు తెలియజేశారు. ఈ సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో సీఈవో శ్రీకాంత్, వైస్ ప్రిన్సిపాల్ రవీంద్ర, ప్లేస్‌మెంట్ అండ్ ట్రైనింగ్ హెడ్ బోడే ప్రసాద్, కో–ఆర్డినేటర్ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా అప్పారావు


బాధ్యతలు స్వీకరిస్తున్న అప్పారావు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యునిగా అగనంపూడికి చెందిన ఉక్కు విశ్రాంత అధికారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొలిపాక అప్పారావు శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. దువ్వాడ రైల్వేస్టేషన్ మేనేజర్ ఎస్.రామకృష్ణారావు కార్యాలయంలో అప్పారావుతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ రైల్వే ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించడం, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. స్టేషన్ మేనేజర్ రామకృష్ణారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి'

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. హెచ్‌ఆర్ నూతన సీజీఎంగా బాధ్యతలు చేపట్టిన జి. గాంధీని శుక్రవారం వారు కలిసి, సత్కరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు భాషా, పి. అప్పలనాయుడు, ఎం. అప్పారావు, సత్యారావు, శ్రీవిద్య సన్యాసిరావు, టి. చక్రధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లకు జరిమానా

అక్కిరెడ్డిపాలెం: అక్కిరెడ్డిపాలెం సర్వీసు రోడ్డు పక్కన నిర్వహిస్తున్న రెండు హోటళ్లకు రూ.5 వేలు చొప్పున జెడ్సీ సింహాచలం జరిమానా విధించారు. హోటళ్లలో వ్యర్థాలను బహిరంగంగా వదిలేస్తుండటంతో శుక్రవారం ఈ ప్రాంతాన్ని పరిశీలించారు. మరోసారి ఇదే పరిస్థితి ఎదురైతే హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

దసరా నాటికి రైతుబజార్ ఏర్పాటు

అగనంపూడి: జీవీఎంసీ 79, 85 వార్డుల్లోని అగనంపూడిలో రైతుబజార్ ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ తెలిపారు. ఇప్పటికే స్థలాన్ని గుర్తించి, మార్కెటింగ్ శాఖకు అప్పగించడం జరిగిందన్నారు. అగనంపూడిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతుబజారు ఏర్పాటు విషయమై ఎమ్మెల్యే నాగిరెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా జిల్లాలో అతి పెద్ద రైతు బజారును అగనంపూడిలో ఏర్పాటు చేసేందుకు వీలుగా 60 సెంట్ల స్థలాన్ని సేకరించి, సీసీఎల్ఏ అనుమతులు పొందిన తరువాత మార్కెటింగ్ శాఖకు స్థలాన్ని అప్పగించారన్నారు. వచ్చే దసరా నాటికి పనులు పూర్తి చేసి అగనంపూడి వాసులకు రైతుబజార్ అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యలమంచిలి అప్పారావు, విందుల వరప్రసాద్, టి.చంద్రమౌళి, గురు గిరీష్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పూర్ణానందశర్మ

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యం

కూర్మన్నపాలెం: పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న జీవీఎంసీ సిబ్బందికి ప్రజలు తమ వంతు సహకారం అందించి, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరాన్ని అగ్రగామిగా నిలబెట్టాలని గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం కోరారు. 87వ వార్డు కాళింగవీధి సచివాలయ పరిధిలో ప్రజలకు స్వచ్ఛసర్వేక్షణ్, డ్రైడే–ఫ్రైడే కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెడ్సీ సింహాచలం మాట్లాడుతూ యాంటీ లార్వల్ ఆపరేషన్ యాక్టివిటీస్, తడి–పొడి చెత్తలను వేరువేరుగా అందించడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల ఉత్పత్తిని నియంత్రించవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులను నివారించవచ్చని, ప్రజలందరూ ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించాలని కోరారు. 87వ వార్డులో చేపడుతున్న స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలు నగరంలోనే అగ్రస్థానంలో ఉన్నాయన్నారు. తిరుమల నగర్ కాలనీలో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై చేపడుతున్న కార్యక్రమాలను వార్డులోని అన్ని ప్రాంత్రాలకు విస్తరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, కార్పొరేటర్ బొండా జగన్, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, నాయకులు బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, చిత్రాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సిద్ధేశ్వరం డబల్ రోడ్డు పనులు ప్రారంభం

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు సిద్ధేశ్వరం డబుల్ రోడ్డు పనులను కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఈ రోడ్డు పనుల నిమిత్తం రూ.1.94 కోట్ల నిధులు మంజూరు చేశారని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా ఈ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉన్నా నిధుల కొరత కారణంగా చేపట్టలేకపోయారన్నారు. ఈ నేపథ్యంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణతో మాట్లాడి 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్ ఏఆర్ కన్‌స్ట్రక్షన్స్ అప్పలరాజుకు సూచించారు. కార్యక్రమంలో గొందేశి సత్యారావు, నందికి తాతారావు, గొందేశి సత్తిరెడ్డి, గొరుసు సత్యం తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

గాజువాక : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని సీఎల్‌సీ మినిస్ట్రీస్ అధినేత బిషప్ ఆల్‌ఫ్రెడ్ మహంతి అన్నారు. మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మహిళలు కుట్టు మిషన్లతో సంపాదన ప్రారంభించి, కుటుంబాలకు చేదోడువాదోడుగా ఉండాలన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మెర్సీ మహంతి తదితరులు పాల్గొన్నారు.


కుట్టు మిషన్‌ను పంపిణీ చేస్తున్న మినిస్ట్రీస్ ప్రతినిధులు

ఈఆర్ఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణలో కార్మికవర్గం చురుగ్గా పాల్గొవాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి బి.ఎస్.రాజు కోరారు. ప్రైవేటీకరణ ఉద్యమం ప్రారంభం నుంచి ఐఎన్‌టీయూసీ చురుగ్గా వ్యవహరిస్తోందన్నారు. శుక్రవారం జరిగిన ఎలక్ట్రికల్ రిపేర్ షాప్ (ఈఆర్ఎస్) నూతన కార్యవర్గ ఎన్నిక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విభాగం నూతన కన్వీనర్‌గా పి.వి.రాజు, అధ్యక్షునిగా కె. అరుణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శ్రీకాంత్, పి.ఎస్.ఎస్. ప్రసాద్, బి. శ్రీనివాస్, కార్యదర్శిగా బి. సురేష్, సహాయ కార్యదర్శిగా కె. అప్పలరెడ్డి, కోశాధికారిగా ఎ. నరేష్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అదనపు ప్రధాన కార్యదర్శి బీ.ఎస్. రాజును నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు ఆర్.కోటేశ్వరరావు, ఎం.పైడికొండలరావు, మొల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఇంటక్ అదనపు ప్రధాన కార్యదర్శి రాజును సత్కరిస్తున్న నాయకులు

దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

అక్కిరెడ్డిపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో దొంగతనం చేసిన కేసులో నిందితుడు షేక్ గౌస్‌కు 8వ ఏసీసీఎం కోర్టు జడ్జి వై.శ్రీలక్ష్మి రెండు సంవత్సరాల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారని గాజువాక క్రైం సీఐ పి.సూర్యనారాయణ తెలిపారు. దీంతో పాటు మరో క్రైం కేసులో మరో వ్యక్తికి ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు. ఈ కేసుల ఛేదనలో కృషి చేసిన దువ్వాడ క్రైం ఎస్ఐ డి.కాశిదాసు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.వాణి, సీఎంఎస్ కానిస్టేబుల్ నాయుడు, కోర్టు కానిస్టేబుల్ హరీష్‌లను జడ్జి వై.శ్రీలక్ష్మి ప్రత్యేకంగా అభినందించారు.

భెల్ యాజమాన్యాన్ని కలిసిన నూతన కార్యవర్గం


జీఎం ఇన్‌చార్జి జితేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు సంస్థ యాజమాన్యాన్ని శుక్రవారం కలిశారు. జీఎం (ఇన్‌చార్జి) ఎస్. జితేందర్ రెడ్డిని ఆయన చాంబర్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు జి.కిరణ్, ఉపాధ్యక్షుడు టి.సాంబశివరావు, ఎ.ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు, సంయుక్త కార్యదర్శి బి.రాజ్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హెచ్.బోగేష్, అసిస్టెంట్ సెక్రటరీలు పి.శ్రీనివాసు, డి.సాయిబాబు, కోశాధికారి కె.పవన్ కుమార్ కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. సంస్థ జీఎం భుజంగరావు, హెచ్‌ఆర్ (హెడ్) ఎం.వి.ఎస్.ఎన్.రాజు, సీనియర్ మేనేజర్ (హెచ్‌ఆర్) జి.చంద్రశేఖర్‌లను కలవడంతో వారు అభినందనలు తెలియజేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతుడు

పెదగంట్యాడ: మండలంలోని అరుణా థియేటర్ ఎదురుగా గల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. న్యూపోర్టు సీఐ రాము తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఓ వ్యక్తి రోడ్డు పక్కన మృతి చెంది ఉన్నట్టు తమకు సమాచారం అందిందని తెలిపారు. ఆ వ్యక్తి ఎవరు, ఎలా మృతి చెందాడో తెలియలేదన్నారు. ఒంటిపై టీషర్ట్, ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 94409 04309, 85003 87400 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డుపై జారిపడ్డ మొక్కజొన్న విత్తనాలు


రోడ్డుపై జారిపడ్డ మొక్కజొన్న విత్తనాలను తొలగిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది

అక్కిరెడ్డిపాలెం: విశాఖ పోర్టు నుంచి షీలానగర్ సిగ్నల్ పాయింట్ గుండా బీహెచ్‌పీవీ వైపు భారీ వాహనంలో వెళ్తున్న మొక్కజొన్న విత్తనాలు జారిపడి రోడ్డుపై పరుచుకున్నాయి. శుక్రవారం సాయంత్రం నాతయ్యపాలెం శ్రీనివాస కల్యాణ మండపం ఎదురుగా జరిగిన ఈ సంఘటనతో స్వల్పంగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సమాచారం అందుకున్న ట్రాఫిక్ ఎస్ఐ యూసఫ్ సంఘటనా స్థలానికి చేరుకుని, రోడ్డుపై మొక్కజొన్న విత్తనాలను సిబ్బంది సహాయంతో తొలగించారు.

ఉమారామలింగేశ్వరాలయంలో మాస శివరాత్రి పూజలు


రామలింగేశ్వరుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు ఉమా రామలింగేశ్వర ఆలయంలో శుక్రవారం మాస శివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం భద్రతా విభాగం అధికారి రంగారావు సహకారంతో నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, సురేంద్ర, కనకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ సీజ్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్‌ను గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్ కుమార్ సీజ్ చేశారు. వాటర్ ప్లాంట్‌పై పలు ఫిర్యాదులు రావడంతో శుక్రవారం వారు ప్లాంట్‌ను పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణకు సంబంధించిన అనుమతి పత్రాలను చూపించమనగా, అవి లేకపోవడంతో వారు వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేశారు. కొద్దిరోజుల ముందు వాటర్ ప్లాంట్‌కు సంబంధించిన పత్రాలను చూపమనడంతో సదరు యజమాని వివిధ కారణాలు చూపి కొంత సమయాన్ని కోరాడు. నిర్ణీత గడువు ముగిసినా అనుమతి పత్రాలు చూపలేదని జెడ్సీ తెలిపారు. ప్లాంట్‌కు సంబంధించిన బోర్‌వెల్ ప్రభుత్వ స్థలంలో ఉండటంతో పాటు నీటి పరీక్షలు వంటి పత్రాలు లేకపోవడం, వాటర్ ప్లాంట్ బోర్ వెల్ ద్వారా నీటిని వ్యాపారపరంగా వినియోగించుకోవడంతో చుట్టుపక్కల ఉన్న వారికి నీటి కొరత రావడంతో వాటర్ ప్లాంట్‌పై పలుమార్లు అధికారులకు బాధితుల ఫిర్యాదులు కూడా అందాయని అధికారులు తెలిపారు.


ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న జెడ్సీ, ఏఎంహెచ్‌వో

బాడీబిల్డింగ్ పోటీల ట్రోఫీ ఆవిష్కరణ

పెదగంట్యాడ: న్యూ పెంటమాంబ బాక్సింగ్ క్లబ్ అధ్యక్షుడు రామోజీ ఆధ్వర్యంలో పెదగంట్యాడ శివాలయం ఆవరణలో వచ్చే నెల 31న జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పోటీల ట్రోఫీని, పోస్టర్‌ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని జిమ్‌లు, బాక్సింగ్ క్లబ్ నుంచి సుమారు ఆరువేల మంది ఈ పోటీలకు హాజరు కానున్నారన్నారు. ప్రథమ బహుమతి కింద రూ.20వేలు, మెడల్, సర్టిఫికెట్, రెండో బహుమతి కింద రూ.10వేలు, మూడో బహుమతిగా రూ.5వేలు నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో కిల్లాన ముసలయ్య, గూటూరు శంకరరావు, జాతీయ బాడీబిల్డర్ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీ ఆవిష్కరిస్తున్న కరణంరెడ్డి నర్సింగరావు

స్టీల్‌ప్లాంట్‌లో రెండో దశ బొప్పాయి మొక్కల పెంపకం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఆగ్రోఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం రెండో దశ బొప్పాయి మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఉక్కునగరంలోని నాలుగు ఎకరాల్లో ఉన్న పండ్ల తోట మధ్యస్థలంలో 1500 మొక్కలను నాటడానికి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ విభాగం సీజీఎం వై. చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ పచ్చదనాన్ని కాపాడుతూ, ఉన్న భూమిలో ఖాళీగా ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు ఆగ్రోఫారెస్ట్ విభాగం సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఆగ్రోఫారెస్ట్ విభాగాధిపతి వి.ఎల్.పి. లాల్ తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న సీజీఎం చంద్రశేఖర్

కణితి పీహెచ్‌సీని సందర్శించిన డీఎంహెచ్‌వో

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష

మహారాణిపేట: కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం సందర్శించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై పీహెచ్‌సీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయి సందర్శనకు వెళ్లినప్పుడు మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో విధిగా నమోదు చేసి వెళ్లాలని సిబ్బందిని ఆదేశించారు. వ్యాక్సిన్, ఓపీ రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రణాళికాబద్ధంగా బుధవారం హెడ్ క్వార్టర్‌లోను, శనివారం పీహెచ్‌సీ పరిధిలో వ్యాక్సినేషన్ వేయాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రాన్నంతా పరిశీలించారు. పీహెచ్‌సీ కొత్త భవనం సివిల్ వర్క్స్ కోసం ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్‌తో చర్చించారు. కార్యక్రమంలో మహిళా ఆరోగ్యాధికారి డాక్టర్ బి.ఉమావతి, పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


కణితి పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు